# కీ॥ శే॥ కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావుగారు

— శ్రీ రాయసం వెంకటశివుడు.

కీ. శే. లక్ష్మణరావుగారితోడి పరిచయభాగ్యము నాకు 1897 వ సంవత్సర ప్రాంతమున నారంభమయ్యెను. ఆకాలమున నేను బెజవాడ పురమున క్రైస్తవోన్నతపాఠశాలలో నుపాధ్యాయునిగ నుండి, స్త్రీవిద్యాభ్యున్నతికై "తెలుగుజనానా పత్రిక" యను మాసపత్రికను బ్రచురించుచు వచ్చితిని. లక్ష్మణరావుగారి యక్క కీ. శే భండారు అచ్చమాంబగారు ఆపత్రికకు వ్యాసములు వ్రాయుచుండిరి. అక్కతమ్ముల కపారమగు నన్యోన్య ప్రేమయేకాదు, అవినాభావమని కూడ చెప్పవచ్చును. తమ్ముని కళాశాలా విద్యయం దెక్కువ శ్రద్ధవహించిన యక్క యొక్క జ్ఞాన పరిపోషణమందును ఆమెకు విశాలభావములు కుదుర్చుటట్లను, తమ్ముడు మిగుల పాటుపడెను. దీని పర్యవసాన మేమనగా, ఆంగ్లమహారాష్ట్ర గ్రంథములు వారిరువురును పఠించి, వానియందలి యుపయుక్త విషయములు ఆంధ్రుల యుపయోగార్థమై తెలుగుచేయుచు వచ్చిరి. ఆ కాలమున తెలుగు వార్తాపత్రికలసంఖ్య చాల తక్కువ. నా పత్రిక ఆంధ్రస్త్రీల కొఱకేర్పడినది గావున, అచ్చమాంబగారు "జనానాపత్రికకు" తరుచుగ వ్రాయుచు వచ్చిరి. కొంత కాలమునకు లక్ష్మణరావుగారును ఆ పత్రికకు వ్రాయ నారంభించిరి.

1898 వ సం॥ అగష్టునెల "జనానా పత్రిక" లో, అచ్చమాంబగారు "మహారాణి స్వర్ణమయి" గారి చరిత్ర వ్రాసిరి, ఆ డిసెంబరు సంచికలోను; పిమ్మట నెలపత్రికలోను, "జోనుకమారి" ని గురించి వ్రాసిరి. ఇంగ్లీషు పుస్తకములందలి సంగతులిట్లు తర్జుమా చేయుటయందు చేయితిరిగి; ఆమె మెల్లమెల్లగా చిన్న సొంతకథలల్లుట కారంభించిరి. 1898 జూలై నెల పత్రికలో "ప్రేమపరీక్షణ" యను కథను వ్రాసిరి. ఆ సెప్టెంబరు సంచిక కీమె వ్రాసిన "ఎఱువులసొమ్ము బరువుల చేటు" అను కథ మిగుల రమ్యమైనది.

అక్కయిట్లు కలము సాగించుచుండగా తమ్ముడును పత్రికలకు వ్రాయదొడంగెను. "విశ్వముయొక్క విరాట్ స్వరూపము" అను శీర్షికతో "తెలుగు జనానాపత్రిక" యొక్క 1898 వ సం। అక్టోబరు సంచిక కీయన యొక చిన్న వ్యాసమును వ్రాసిరి. తండ్రి కూతుల సంభాషణారూపముననున్న యీ వ్యాసమందు భూమికిని గ్రహనక్షత్రములకును గల పరస్పర సంబంధము తేటపఱుపబడెను. ఆ మఱుసటినెల పత్రికలో వీరు

"విశ్వముయొక్క బాలస్వరూపము" అను సంభాషణ ప్రచురమయ్యెను. ఇందలి విషయము భూమియందు గల సూక్ష్మాణువుల కధయె. ఇట్టి రచనల మూలమున లక్ష్మణరావుగారు జనసామాన్యమునకు జ్ఞానబోధనము చేయువిధానము నలవరుచుకొనిరి.

ఇట్లు అక్కతమ్ములు "జనానా పత్రికకు" వ్రాయుచు వచ్చిరి. 1901 సెప్టెంబరు సంచికలో "లలితా శారదులు" అను కధను ప్రచురించిన అచ్చమాంబగారు, ఈ లోపుగ గ్రంధకర్తృత్వమునకును బూని తమ్ముని యాలోచనచొప్పున "అబలా సచ్చరిత్ర రత్నమాల" అను 355 పుటల పుస్తకమును వ్రాసిరి. అపుడు చెన్నపురిలో నుద్యోగమున నున్న కీ. శే. కందుకూరి వీరేశలింగము పంతులుగారీ తెలుగు పుస్తకమును తమ "చింతామణి" ముద్రాలయమందు ప్రకటించిరి. ఈ పుస్తకవిమర్శనమును నేను పై సంచికలోనే వ్రాసితిని. పుస్తకములో రమారమి నూరుగురు స్త్రీల కధలు గలవు. వీరందఱును వేయి సంవత్సరములకు లోపుగా హిందూదేశమున నివసించిన స్త్రీలె. ఈ లలనామణి తన పుస్తకమును పతియగు మాధవరావుగారి కంకితము చేసిరి.

1898 వ సంవత్సరమున లక్ష్మణరావుగారు తమ బావను అక్కను విడిచి నాగపూరు పట్టణమందలి మారిసు కళాశాలలో బి. యె. తరగతిలో జేరిరి. 1903 వ సంవత్సరమున మాధవరావుగారు సెలవు పుచ్చుకొని సకుటుంబముగ దేశాటనముచేయుచు, కొన్నిరోజులు బెజవాడలో మాయింట దిగియుండిరి. ఆ సందర్భమందో, అంతకు బూర్వమో, లక్ష్మణరావుగారిని నేనుమొదటిసారి గలసికొని మాటాడితిని. చక్కని మేధాశక్తియు, చురుకుదనమును గల యువకుని వలె గానిపించిరి. ఈతడు ఉన్నతదశకు రావలసిన పురుషుడుగదా యనుకొంటిని.

ఇట్లుండగా లక్ష్మణరావుగారి ప్రియసోదరి అచ్చమాంబగారు 18-1-1905 వ తేదీని అకాలమృత్యువువాతబడిరి. ఆసంవత్సరము ఫిబ్రవరి "జనానాపత్రికలో" అచ్చమాంబగారి జీవితచరిత్ర సంగ్రహముగ దెలుపబడెను. అక్కతమ్ముల అన్యోన్యప్రేమయు, ఒకరి విద్యాభివృద్ధినిగుఱించి యింకొకరు అపారముగ గష్టపడుటయు మున్నగు విషయములు తెలుపబడెను. చిన్ననాడు తమ్మునితో గలసి యక్క విద్యాభ్యాసముచేయుచు, తెలుగు మహారాష్ట్ర భాషలలో గొంత సాహిత్యము సంపాదించిరనియును అందు వ్రాయబడెను. పెద్దవాడై లక్ష్మణరావుగారు కళాశాలా విద్యకై నాగపురము వెడలిపోవలసివచ్చినను ఆయన సెలవుదినములలో నింటికి వచ్చినపుడు అక్క విద్యాభివృద్ధికెంతో తోడ్పడుచుండిరని చెప్పబడెను. కలకత్తా సర్వకలాశాలలో యం. యె. పరీక్షలో జయమంది అప్పటికి లక్ష్మణరావుగారు మునగాల సంస్థానమున దివానుపదవి నలంకరించియుండిరి "ఈయక్కతమ్ముల యన్యోన్యానురాగ మింతింతయని చెప్పుటకు వీలులేదు. వీరి శరీరములు వేరయ్యును, ప్రాణము లొకటియే యయినట్లుండెడివారు.

పరోపకారశీలురాలయిన అచ్చమాంబగారి యకాలమరణమువలన మాకు మా సోదరిని గోలుపోయినట్టి దుఃఖము కలుగుచున్నది" అని జనానాపత్రిక తన సానుభూతిని దెలిపెను.

ఇట్టి సుగుణవతియైన యక్క వియోగము లక్ష్మణరావుగారి కతి దుస్సహముగ నుండెను. కాని వృత్తిసంబంధమైన వ్యాపారములలోను, గ్రంథరచనాది సత్కార్యములందును లక్ష్మణరావుగారు కొంత దుఃఖోపశమనమును గాంచిరి. "ఆంధ్రవిజ్ఞానచంద్రికామండలి" కి వీరు సంపాదకులై, తమ యాజమాన్యమున ముద్రితములైన యమూల్యగ్రంథములద్వారా ఆంధ్రదేశమునకు అపార సేవ చేసిరి.

"ఆంధ్రవిజ్ఞానసర్వస్వము" అనుగ్రంథరాజమును వీ రారంభించి, అందలి మూడు సంపుటములు ప్రచురింపగనే వీరి యరిం యసూయచేతనా యనునట్టుగ 13-7-1923 వ సం॥ న మాయామృత్యువు వీరిని దన పొట్ట బెట్టుకొనిపోయెను! అంతకుబూర్వము అనగా 1919 వ సంవత్సరమున విదేశమున చెన్నపురిలో మరణించిన కందుకూరి వీరేశలింగముపంతులుగారి కంత్యకాలమున పరిచర్యలుచేసిన యదృష్టము లక్ష్మణరావుగారికి గలిగెను. ఈ మహాశయుడారంభించిన మహోద్యమములు ఆంధ్రులు కొనసాగించి కృతార్థులు గావలెను.

# జోహారు

— శ్రీ మంచెళ్ళ సుదర్శనాచార్యులు

ఉ. ఉన్నతవిద్యలో విజయమొందిన ధీనిధివయ్యు నాంధ్రమం
దెన్నిక(గన్న పాండితి లభించిన దెట్టులో? మాతృభాష కె
న్నెన్ని విధాల సేవలొనరించితివో వివరించలేము ల
క్ష్మన్న! తెలుంగుజాతికి వికాసము కల్గెను నీకతాననే.

చ. తెలు(గున సంస్కృతాంగ్లముల దీటగు పండితులుందురేమొ! నీ
వలె మహారాష్ట్రమందు ప్రతిభాయుతులెవ్వరు లేరు నాల్గు భా
షల నసమాన సేవలను సల్పినవారునులేరు తెల్గు వా
రల దురదృష్టమేగద పరాత్పరు( నప్పుడె నీవు జేరినన్.

ఉ. పుట్టినరోజు పండుగలు ముచ్చటతో జరుపంగలేని యీ
చెట్టలభించినందులకు సిగ్గిలుచుంటిమి; స్వర్గమందు మ
మ్మెట్టుల నెంచుచుంటివో? స్మరించెడు భాగ్యము గల్గనిమ్ము నీ
పుట్టుక, నీ యశోగరిమ,( బూనికతో గయికొన్న సేవయున్.

గీ నీదు విజ్ఞాన చంద్రికల్ నెగడినట్టి తెలు(గు దేశము నే(డు నీవెలు(గులందు
దః ర్దశాధ్వాంతమును వీడి దూరదృష్టి( గాంచగల్గెను శుభములు కలుగునింక.